## క్లుప్తంగా

### క్రికెట్ టోర్నీ విజేత 'చోళసముద్రం'


విన్నర్స్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని గలిబిపల్లి గ్రామంలో గత పది రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నీలో చోళసముద్రం జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చోళసముద్రం- గలిబిపల్లి జట్లు తలపడ్డాయి. చోళసముద్రం జట్టు విన్నర్స్‌గా, గలిబిపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచాయి. మొదట బ్యాటింగ్ చేసిన చోళసముద్రం జట్టు 150 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన గలిబిపల్లి జట్టు 136 పరుగులకే ఆలౌట్ అయింది. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా రవి, బెస్ట్ బౌలర్‌గా మురళీకృష్ణ, మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా అనిల్‌కుమార్ నిలిచారు. చోళసముద్రం జట్టుకు రూ.15 వేల నగదుతో పాటు ట్రోఫీని, గలిబిపల్లి జట్టుకు రూ.10 వేల నగదుతో పాటు ట్రోఫీ అందించారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ నారాయణస్వామి ఆ జట్లను ప్రత్యేకంగా అభినందించారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

రొద్దం: మండల కేంద్రంలోని రొద్దకాంబదేవి ఆలయ నిర్మాణానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాలు అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. బెంగళూరుకు చెందిన సాకమ్మ, చక్కరనగౌడ్ దంపతులు రూ 20,116, లక్ష్మమ్మ, తిమన్న దంపతులు రూ 20 వేలు, లక్ష్మమ్మ , వెంకటరమణస్వామి రూ 10 వేలు, బసమ్మ, కృష్ణప్ప దంపతులు రూ 4,500 అందజేశారన్నారు.

### ఉచిత వేసవి శిక్షణ ముగింపు


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని త్యాగరాజునగర్‌లో మార్గదర్శి విద్యానికేతన్ నిర్వాహకులు సాయికళ, మాళప్ప ఆధ్వర్యంలో వెంకటేశ్వర మిల్క్ డైరీ నిర్వాహకులు అరుణ, సీవీ నాగరాజు సౌజన్యంతో జరిగిన ఉచిత వేసవి బడి ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ రమేష్ మాట్లాడుతూ ఎన్ని ఆస్తులు, ఎంత సంపద ఉన్నా విద్యకు మించిన సంపద ఏదీ లేదన్నారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులతో పాటు ఉపాధ్యాయులు నాగిరెడ్డి, శ్రీశైలం, కుమారి, మమత, సిరి, సాయి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎంపిక


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ సభ్యులు

హిందూపురం టౌన్: పట్టణంలోని నిక్కంపల్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఆలయ నూతన కమిటీ గౌరవాధ్యక్షుడిగా రాయల్ గోపాల్, అధ్యక్షుడిగా కే.నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడిగా మూర్తి, రఘు, సెక్రెటరీగా లోకేష్, జాయింట్ సెక్రటరీలుగా గోపి, నవీన్, ట్రెజరర్‌గా రవి, నవీన్, గౌరవ సలహాదారుడిగా ఎం.ఆదినారాయణప్ప, తిమ్మయ్య, హనుమంతప్ప, గోవిందప్పతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశామన్నారు.

### కోఆపరేటివ్ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ విజయం


గెలుపొందిన డైరెక్టర్లను అభినందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, టీచర్లు

పెనుకొండ: పట్టణంలో ఆదివారం జరిగిన టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో యూటీఎఫ్ అభ్యర్థులపై ఏపీటీఎఫ్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఐదేళ్లకోసారి జరిగే ఈ ఎన్నికలు ఉత్కంఠంగా జరిగింది. ఎలక్షన్ అధికారిగా వన్నూరు స్వామి వ్యవహరించారు. మొత్తం 316 ఓట్లు ఉండగా 266 ఓట్లు పోలయ్యాయి. ఏపీటీఎఫ్‌కు ప్యానెల్‌కు చెందిన కే.రమేష్‌బాబుకు 218 ఓట్లు, అమీర్‌వలికి 216 ఓట్లు, కృష్ణానాయక్‌కు 213 ఓట్లు, రాజశేఖర్‌కు 212 ఓట్లు, రంగేస్‌కుమార్‌కు 209 ఓట్లు, వెంకటరమణనాయక్‌కు 206 ఓట్లు, జవాజి నాగరాజుకు 202 ఓట్లు పోలయ్యాయి. గెలుపొందిన అభ్యర్థులు టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ అభ్యున్నతికి పాటుపడుతామని పేర్కొన్నారు.


మడకశిరలోని సరస్వతీ విద్యా మందిరం షాపు వద్ద గుమిగూడిన లబ్ధిదారులు


హిందూపురంలోని సత్యనారాయణపేటలో స్టోర్‌కు పూజ చేసి మూసివేసిన దృశ్యం


హిందూపురంలోని ఆబాద్‌పేట స్టోర్ వద్ద క్యూ..

# అష్ట కష్టాలు

- రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల పడిగాపులు
- ఉదయం నుంచి రాత్రి వరకూ వేచివున్న వైనం
- కూటమి ప్రభుత్వ తీరుపై కార్డుదారుల ఆగ్రహం

రేషన్ సరుకుల కోసం లబ్ధిదారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థను రద్దు చేసిన ప్రభుత్వం రేషన్ దుకాణాల వద్దనే సరుకులను పంపిణీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఆదివారం ఉదయం నుంచే లబ్ధిదారులు రేషన్ దుకాణాల ముందు బారులు తీరారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో సర్వర్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి రాత్రి దాకా పడిగాపులు కాసినా సరుకులు లభించలేదని లబ్ధిదారులు వాపోయారు. – సాక్షిబృందం


పెనుకొండ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రేషన్ షాపు వద్ద సరుకుల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు


అమరాపురం: సరుకుల కోసం రేషన్ దుకాణం వద్దకు నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలు

### ముందే బాగుండేది



గతంలో ఎండీయూ ఆపరేటర్లు ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు పంపిణీ చేసేవారు. కానీ నేడు గంటల తరబడి కాసుకొని రేషన్ సరుకులు తీసుకెళ్లాల్సి రావడం బాధాకరం. వృద్ధులు, వికలాంగులు, మహిళలు ప్రతి ఒక్కరూ అవస్థలు పడుతున్నారు. గతంలో మాదిరి మళ్లీ రేషన్ దుకాణాల వ్యవస్థను తీసుకురావడం అందరికీ ఇబ్బందే.

– నూర్, పెనుకొండ


లేపాక్షిలో రేషన్ కోసం క్యూలో ఉన్న లబ్ధిదారులు


హిందూపురంలోని హస్నాబాద్‌లో..


పెనుకొండ మండలం తిమ్మాపురంలో రేషన్ దుకాణాన్ని మూసివేసిన దృశ్యం

### మందుబాబులకు అడ్డాగా కుంభకర్ణుడి ప్రాజెక్టు


కుంభకర్ణుడు పార్కు ఆవరణలోనే మందు తాగుతున్న దృశ్యం

పెనుకొండ రూరల్: పర్యాటకంగా ప్రసిద్ధిగాంచిన కుంభకర్ణుడు ప్రాజెక్టు మందుబాబులకు అడ్డాగా మారింది. పార్కు స్థలంలోనే హోటల్ నిర్వాహకులు బార్‌ను తలపించేలా టేబుళ్లు ఏర్పాటు చేసి మద్యం సరఫరా చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. సంపాదనే ధ్యేయంగా హోటల్ నిర్వాహకులు మద్యంతో పాటు కావాల్సినవన్నీ సమకూరుస్తున్నారన్న విమర్శలున్నాయి.

### రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయండి


బియ్యం తూకాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత, కలెక్టర్ చేతన్

పెనుకొండ: రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని మంత్రి సవిత రేషన్ డీలర్లకు సూచించారు. పట్టణంలోని నూతన 2వ రేషన్ షాపులో బియ్యం పంపిణీని మంత్రి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ చేతన్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకూ ఉదయం, సాయంత్రం వేళల్లో సరుకుల పంపిణీ జరుగుతుందన్నారు.

### మునిమడుగులో కార్డెన్ సెర్చ్

పెనుకొండ రూరల్: సమస్యాత్మక గ్రామమైన మునిమడుగులో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రామసుబ్బయ్య, గంగులప్పపై కేసు నమోదు చేశారు. సీఐ రాఘవన్ రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## 'వెన్నుపోటు' దినాన్ని విజయవంతం చేయండి


మడకశిరలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డి తదితరులు

- పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పిలుపు

మడకశిర/పరిగి: 'అబద్ధాల హామీలతో రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేసిన కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 4న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఆయా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయండి' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. మడకశిర పట్టణం, పరిగి మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమాల్లో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను విడుదల చేశారు. మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డి, మాజీ మంత్రి నర్సేగౌడ్ ఆయా ప్రాంతాల్లో నాయకులతో కలసి వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ... 4వ తేదీ మడకశిర తహసీల్దార్ కార్యాలయంతో పాటు పరిగి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలన్నారు.


**ప్రజల గుండెల్లో ఉన్న ఫొటోను తీసేయ గలరా?**

టీడీపీ ఎమ్మెల్యేలు బలవంతంగా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చాంబర్‌లోని వెళ్లి మాజీ సీఎం వైఎస్ జగన్ ఫొటోను తీసేశారు. అయితే సంక్షేమాభివృద్ధితో జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన జగనన్న ఫొటోను తీసేయగలరా అని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ప్రశ్నించారు. ఏడాది కూటమి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్య పెడుతూ చంద్రబాబు పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు.

**మోసానికి ప్రతిరూపం బాబు**

హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. ప్రజలను నమ్మించి, లేని పోని హామీలను ఇచ్చి, మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొత్తేమీ కాదన్నారు. ఆయన మోసానికి ప్రతిరూపమని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ జయరాజు, మండల కన్వీనర్లు నరసింహమూర్తి, రామిరెడ్డి ఎంపీపీలు సత్యనారాయణరెడ్డి, కవిత తదితరులు పాల్గొన్నారు.

### రైల్వే ఉద్యోగికి సన్మానం


రైల్వే ఉద్యోగిని సత్కరిస్తున్న వేణురెడ్డి తదితరులు

చిలమత్తూరు: రైల్వేలో సీనియర్ అధికారిగా పనిచేస్తున్న వెంకటరమణ పదవీ విరమణ పొందారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి పాల్గొని వెంకటరమణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్‌కుమార్, చిలమత్తూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## శభాష్ .. రవీంద్రారెడ్డి

- చదివిన పాఠశాలలోనే హెచ్‌ఎంగా బాధ్యతలు



హిందూపురం టౌన్: చదువుకున్న బడిలోనే ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు కేహెచ్ రవీంద్రారెడ్డి. మండల పరిధిలోని నక్కలపల్లికి చెందిన రవీంద్రారెడ్డి కే.బసవనపల్లి ఉన్నత పాఠశాలలో 1981వ సంవత్సరంలో 10వ తరగతిని పూర్తి చేశారు. ఇప్పుడు అదే పాఠశాలకే ప్రధానోపాధ్యాయుడిగా నియమితులయ్యారు. చదివిన పాఠశాలలోనే హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించడం తన అదృష్టమని రవీంద్రారెడ్డి తెలిపారు. చిత్తశుద్ధితో పనిచేస్తూ ఈ పాఠశాలను మండలంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు.

## ట్రాక్టర్ ఇంజిన్లు ఇచ్చారు .. ట్రాలీలు మరిచారు !


దేవరహట్టిలో నిరుపయోగంగా మారిన ట్రాక్టర్ ఇంజిన్


పీసీ గిరి గ్రామంలో ఇలా..


కరికెర పంచాయితీలో నిరుపయోగంగా మారిన ట్రాక్టర్ ఇంజిన్

- నీరుగారుతున్న స్వచ్ఛ భారత్ లక్ష్యం
- అద్దె ట్రాక్టర్లతో పారిశుధ్య నిర్వహణ భారం
- నియోజకవర్గ వ్యాప్తంగా మూలకు చేరిన 23 ట్రాక్టర్ ఇంజిన్లు

గుడిబండ: స్వచ్ఛ భారత్ లక్ష్యం నీరుగారుపోతోంది. గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి, చెత్త సంపద కేంద్రానికి తరలించి స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్న ఆశయానికి తూట్లు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధిక జనాభా ఉన్న పంచాయతీలకు రూ.6 లక్షలు చెల్లించి ట్రాక్టర్లను మంజూరు చేసింది. అయితే చెత్తను తరలించేందుకు అవసరమైన ట్రాలీ ఇవ్వడం మర్చిపోయారు. దీంతో లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ట్రాక్టర్ ఇంజిన్లు గ్రామ సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాలు, రక్షిత భవనాల వద్ద మూలుగుతున్నాయి.

**మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా ...**

నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలకు మొత్తం 23 నూతన ట్రాక్టర్ ఇంజిన్లను అందజేశారు. అందులో గుడిబండ మండలంలో కరికెర, దేవరహట్టి, సీసీ గిరి, గుణేమోరుబాగల్, తాళికెర గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లను ఇచ్చారు. అలాగే మడకశిర మండలంలో గౌడనహళ్లి, కల్లుమర్రి, మణూరు, బుళసముద్రం, వైబీ హళ్లి గ్రామ పంచాయతీలకు మంజూరు చేశారు. రొళ్ల మండలంలో రాయాపురం, బీజీ హళ్లి, హాలికుంట, మల్లినమడుగు గ్రామ పంచాయతీలకు, అగళి మండలంలో మధూడి, కోడిహళ్లి, ఆర్‌జీ హళ్లి గ్రామ పంచాయతీలకు నూతనంగా ట్రాక్టర్ ఇంజిన్లను పంపిణీ చేశారు. ఆరు నెలల క్రితం ఇచ్చిన ట్రాక్టర్ ఇంజిన్లకు ట్రాలీలను ఇవ్వకపోవడంతో అవి మూలనపడ్డాయి. వాటి భద్రత విషయంలో కూడా అధికారులు చేతులెత్తేశారు.

**అద్దె ట్రాక్టర్లే దిక్కు**

గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రభుత్వం ట్రాక్టర్ ట్రాలీలు ఇవ్వకపోవడంతో తప్పని పరిస్థితుల్లో చెత్త సేకరణకు పంచాయతీ నిధులు చెల్లించి అద్దె ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీలకు కేటాయించిన ఇంజిన్లను ఉంచేందుకు సరైన సదుపాయం లేకపోవడంతో అవి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి. ఇలా మరో ఆరు నెలలు ఉంటే తుప్పు పట్టుపడతాయని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాక్టర్ ట్రాలీలను మంజూరు చేస్తేనే పారిశుధ్య నిర్వహణకు సాధ్యమవుతుందంటున్నారు.

### ట్రాలీ లేకపోవడంతో ఇబ్బంది



ప్రభుత్వం చెత్తను చెత్త సంపద కేంద్రానికి తరలించేందుకు ట్రాక్టర్ ఇంజిన్లను మంజూరు చేసింది. కానీ చెత్తను తీసుకెళ్లడానికి ట్రాలీ ఇవ్వకపోవడంతో ఇంజిన్ నిరుపయోగంగా మారింది. అధికారులు తక్షణమే ట్రాలీ మంజూరు చేయాలి.

– సతీష్, సర్పంచ్, దేవరహట్టి గ్రామం, గుడిబండ

### అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రభుత్వం నుంచి కేవలం ట్రాక్టర్ ఇంజిన్లు మాత్రమే వచ్చాయి. అధిక జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు వాటిని పంపిణీ చేయడం జరిగింది. ట్రాక్టర్ ట్రాలీలు ఇంత వరకూ రాలేదు. ట్రాలీలు వచ్చిన వెంటనే సంబంధిత పంచాయతీలకు పంపిణీ చేస్తాము.

– నాగరాజు నాయక్, ఈఓఆర్డీ, గుడిబండ

### యువకుడిపై కత్తితో దాడి

చిలమత్తూరు: మండలంలోని మొరంపల్లికి చెందిన అరుణ్‌కుమార్‌పై అదే గ్రామానికి చెందిన క్రిష్టప్ప తలపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఆదివారం అరుణ్‌కుమార్ కొడికొండ చెక్‌పోస్ట్ నుంచి హిందూపురం వైపునకు వెళ్లే బస్ ఎక్కే క్రమంలో వెనుక వైపు నుంచి క్రిష్టప్ప కత్తితో దాడి చేయడంతో అరుణ్‌కు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే అతన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్రిష్టప్ప కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడని, అందుకు కారణం అరుణ్ అంటూ కక్ష పెంచుకున్నట్లు చెబుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### పదోన్నతుల్లో న్యాయం చేయండి

పెనుకొండ: పదోన్నతుల్లో తమకు న్యాయం చేకూర్చాలని పలువురు ఉపాధ్యాయులు మంత్రి సవితకు ఆదివారం వినతిపత్రమిచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో డీఎస్సీకి 30 శాతం కోటా స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పోస్టులు కేటాయించారని, 70 శాతం కోటా 230 పోస్టులు పదోన్నతులకు కేటాయించాలన్నారు. ఉన్నతాధికారులు ఆంగ్ల సబ్జెక్టుకు 19 ఖాళీలు మాత్రమే చూపుతున్నారని, దీనివల్ల అనేక మంది ఉపాధ్యాయులు పదోన్నతి పొందకనే రిటైర్ అయ్యారన్నారు. మంత్రిని కలిసిన వారిలో నాగభూషణ, చంద్రశేఖర్, సంపత్, జవ్వాజి నాగరాజు, కవిత, శ్రీనివాసులు తదితరులు వున్నారు.